# కఠోపనిషత్తు

(కృష్ణ యజుర్వేదం నుండి)

వ్యాఖ్యాత :

'అభినవ వ్యాస' 'జ్ఞానప్రపూర్ణ'

**శ్రీ దేవిశెట్టి చలపతిరావు**

B.Sc., (Ag)

ఆధ్యాత్మిక జ్ఞానపీఠం – చిలకలూరిపేట

# పూజ్య గురుదేవులు



'అభినవ వ్యాస' 'జ్ఞానప్రపూర్ణ'

# శ్రీ దేవిశెట్టి చలపతిరావు

**B.Sc., (Ag)**

వ్యవస్థాపకులు :

ఆధ్యాత్మిక జ్ఞానపీఠం – చిలకలూరిపేట

# కఠోపనిషత్తు

## తొలిపలుకు

సమస్త మానవాళి – వారి వారి స్థాయిలలో ఉద్ధరింప బడటానికి మార్గాలను చూపేవి **వేదాలు**. పరిపక్వం చెందిన సాధకులకు, వైరాగ్య భావన గలవారికి, మోక్షం కోసం తపించే వారికి చక్కగా ఉపకరించేవి **ఉపనిషత్తులు.** ఉపనిషత్తు అనే శబ్దం వినిపించగానే ఎవరిలోనైతే ఒక పారవశ్యం, పులకరింత కలుగుతుందో వారే ఉపనిషత్తులలోని జ్ఞానాన్ని గ్రహించగలబుద్ధిని కలిగి ఉంటారు. **ఉపనిషత్తు అనగా అజ్ఞానమును పూర్తిగ నశింపజేసిది అని ఒక అర్థం. వైరాగ్య వంతుడైన సాధకుని పరమాత్మ సన్నిధికి చేర్చి ఆ పరమాత్మతో ఐక్యత కలిగించేది ఉపనిషత్తు అని మరొక అర్థం.** నాలుగు వేదాలలోను జ్ఞాన భాండాగారాలనదగిన ఉపనిషత్తులు 1180 ఉన్నాయి. అయినా ఇప్పుడు అన్ని పేర్లు కూడా లభించటంలేదు. **ముక్తికోపనిషత్తులో** శ్రీరాముడు ఆంజనేయునికి 108 ఉపనిషత్తుల పేర్లను తెలియజేయటం జరిగింది. అందులో 10 ఉపనిషత్తులను అత్యంత ప్రధానమైనవిగా భావించి **ముగ్గురు ఆచార్యులు** వాటికి భాష్యాలు వ్రాశారు. అవే **దశోపనిషత్తులు** గా ప్రఖ్యాతిగాంచినవి. అవి. ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య ఐతరేయ, తైత్తిరీయ, ఛాందోగ్య, బృహదారణ్యక – ఉపనిషత్తులు, **ఉపనిషత్తులనే వేదాంతము** అని కూడా అంటారు. ఎందుకంటే వేదాలకు అంతములో ఉన్నవి గనుక. ఇలా వేదాలలో చివరి భాగంలో ఉన్న ఈ ఉపనిషత్తులు సాధన చతుష్టయ సంపన్నులై, అర్హత గలిగిన పరిపక్వ సాధకులను పరమాత్మ **సన్నిధికి చేర్చి ఆ పరమాత్మతో ఐక్యత కలిగించి, జన్మరాహిత్యం ద్వారా శాశ్వత బ్రహ్మానందాన్ని కలిగిస్తాయి.**

అయితే ఒక విషయం బాగా గుర్తుంచుకోవాలి. ఏ ఉపనిషత్తు ఐనా తనంతట తానుగా, మనకు ఇష్టం ఉన్నా – లేకున్నా బలవంతంగా మనలను ఈడ్చుకు వెళ్ళి పరమాత్మ సన్నిధికి చేర్చదు. ఎవరైతే ప్రపంచంలో తిరుగుతూ, వారి వారి వాసనల కనుగుణంగా వ్యవహరిస్తూ, సుఖ దుఃఖాలను పొందుతూ,– **ఏదో ఒక నాటికి నిత్యమైన దేమిటో – అనిత్యమైన దేమిటో తెలుసుకొని,** అనిత్యమైన ప్రాపంచిక విషయాలపట్ల, భోగాలపట్ల వైరాగ్యం చెంది, నిత్యమైన, శాశ్వతమైన, ఆనంద స్వరూపమైన పరమాత్మపట్ల ఆసక్తిగలిగి, **ఆ పరమాత్మ కొరకు తపిస్తూ సాధనలు చేస్తారో అట్టి వారినే ఉపనిషత్తులు పరమాత్మ సన్నిధికి చేర్చేది. సాధనలు అంటే** ఏదోతాలాతోలీ సాధనలు కాదు, ఏదో చేశామంటే చేశామనే రకంకాదు, చేసి చేతులు దులిపేసుకోవటం కాదు, ముక్తికోసం తీవ్రసాధనలు చేయాలి. నిజంగా ముక్తి సాధన అనేది ఈ భూమి మీద జన్మించే ప్రతి ప్రాణికీ అనివార్యం. ఎప్పటికైనా తప్పదు. **కాని మానవులు తప్ప మిగిలిన ఏ ప్రాణికూడా ముక్తి సాధనలు చెయ్యలేదు.** వాటికి ఆలోచించే బుద్ధిలేదు. ఆచరించేందుకు అవకాశాలు లేవు. ఒక్క మానవునికే ఆ అవకాశం, అదృష్టం. అందుకే అన్ని జన్మలలోను మానవజన్మ శ్రేష్ఠమైనది అంటూ **'జంతూనాం నరజన్మ దుర్లభం'** అని శంకరులవారన్నారు. అంతమాత్రాన మానవులంతా ముక్తి సాధనలు చేస్తున్నారా? – చేస్తారా? లేదు. **చాలామంది జంతువులలాగానే తినటం, కనటం, నిద్రపోవటం అనే వాటితోనే సరిపుచ్చుతుంటారు.** మరి కొందరు లౌకిక భోగాలు, విషయాల కొరకే జీవితాలను వినియోగించుకొంటారు. మరికొందరు ఏదో 'నామ్‌కే వాస్తే' గా భగవంతుని తలచుకుంటారు. లేదా తమ స్వార్థ ప్రయోజనాలకొరకో, **దుఃఖాలు కలిగినప్పుడో** భగవంతునికి దగ్గరౌతూ ఉంటారు. అలాగాక **కేవలం భగవంతుని కొరకే భగవంతునికి దగ్గర కావాలనుకొనేవారు, జన్మను**

**సార్థకం చేసుకొనుట కొరకే** భగవంతుని దరిచేరేవారు చాలా అరుదుగా ఉంటారు. వీరిలో భగవంతుని పూర్తిగా శరణాగతి పొంది 'త్వమేవ సర్వం మమదేవ దేవ' అని దగ్గరయ్యే వారు బహుకొద్ది మందే.

నిజంగా ముక్తి సాధనకై భగవంతుడు ప్రతి మానవుని తొందరపెడుతూనే ఉంటాడు. ఎప్పుడూ **కష్టాలు, కడగండ్లు అనే మొట్టికాయలు వేస్తూనే ఉంటాడు.** అయినా మానవుడు జన్మలకు జన్మలు నెట్టుకొస్తూనే ఉంటాడు. అనిత్యమైన వాటి కోసమే ప్రాకులాడుతూ ఉంటాడు. **బొప్పి కడితే మందు వేసుకుందామనుకుంటాడే గాని ఈ మొట్టికాయల వెనుక భగవంతుని ఉద్దేశ మేమిటా అని ఆలోచించడు.** ఐతే భగవంతుడు మాత్రం విసుగు చెందకుండా తన ప్రయత్నం సాగిస్తూనే ఉంటాడు. అనేక కోట్లాది జన్మల తర్వాత నైనా జ్ఞానోదయం కలగాల్సిందే. అయితే **చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు** – సంసారబాధ నసాళానికి ఎక్కి, భరించలేక పిచ్చెక్కినట్లై అప్పుడు కక్కుర్తి పడి ఏదేదో హడావుడిగా చేసేస్తే – సుఖం దొరకకపోగా దుఃఖం కలుగుతుంది – మరింతగా పెరుగుతుంది. ఇలా హడావుడిగా ఏదో తెలిసీ తెలియని సాధనలు చేసి; వెనుక **పిచ్చి కుక్క వెంబడిస్తే పరుగెత్తినట్లు పరుగులు తీసి ఏ గోతిలోనో పడక, దుఃఖాల్లో చిక్కుబడి పోక, చక్కని అవకాశాలు లభించిన ఈ జన్మలోనే** సద్గురువులను ఆశ్రయించి, ఉపనిషత్తులలో నిక్షిప్తంచేయబడిన ఆత్మజ్ఞానాన్ని అవగతం చేసుకొని, ఆచరించటం తెలివైన వారి పని. అది బుధుల లక్షణం. ఉత్తముల లక్షణం.

అలాగాక మానవుడు సంసారధ్యేయంతో, లౌకిక విషయాలపట్ల ఆసక్తితో, భోగాలపట్ల వ్యామోహంతో, ఈ ఒక్క జన్మనే దృష్టిలో పెట్టుకొని, శాస్త్రాలన్నింటిని తిరస్కరించి, మహాత్ములయొక్క, జ్ఞానుల యొక్క సలహాలను – సూచనలను పెడచెవిన పెట్టి, గురువులను ధిక్కరించి,

మొండిగా – మూర్ఖంగా ఈ సంసార లంపటంలోనే కూరుకుపోతే భగవంతుడు ఊరు కుంటాడా? అడుగడుగునా విచారణలకు – శిక్షలకు గురిచేస్తూ ఉంటాడు. అదీ ఎప్పుడో కాదు. ఇప్పుడే. ఈ జన్మలోనే. అయినాసరే నిర్లక్ష్యం చేశావా! – మరణించిన తర్వాతనైనా ధర్మాధర్మ విచారణ పేరుతో యమధర్మరాజు కోర్టులో ముద్దాయిగా నిలబడాలి. ఆయన వేసే శిక్షలను అనుభవించాలి. మరి అక్కడ కోర్టులో నిలబడి పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిత్ర గుప్తుడు అడిగే వాటికి బిక్క మొగం వేస్తే ఏంలాభం? అక్కడ నిన్ను రక్షించటానికి ఏ డిఫెన్స్ లాయరూ ఉండడు. కనుక ఆ విషయాలన్నీ ఇక్కడే బాగా ఆలోచించుకొని తగిన విధంగా తయారైపోవాలి. **అసలు యమధర్మరాజుకు ఎదురుపడకుండా తప్పించుకొనే ఉపాయమేదో ఇప్పుడే ఇక్కడే ఆలోచించు కోవాలి. భజ గోవిందంలో దీనికి సూటిగా ఉపాయం చెప్పారు శంకరులు**

**"భగవద్గీతా కించిదధీతా గంగాజల లవకణికా పీతా ।**
**సకృదపి యేన మురారి సమర్చా క్రియతే తస్యయమేన నచర్చా ॥**

భగవద్గీత అధ్యయనం – (జ్ఞాన) గంగాజలపానం – మురారి అర్చనం **(అహం కారమనే రాక్షసుడే ముర –** అతణ్ణి సంహరించినవాడే మురారి. కనుక **అహంకారాన్ని అంతంచేసి పరమాత్మగా నిలిచిపోవాలి) –** ఈ మూడూ చేసిన వారికి ఇక యమునితో ఎట్టి వివాదమూ లేదు. ఆయన వేరు.

యమధర్మరాజుకు సంబంధం లేకుండా, ఆయన కంటపడకుండా, ఆయనతో వివాద పడకుండా ఉండాలంటే ఆయన మాటలలోనే చెప్పిన ఈ కఠోపనిషత్తును ప్రతివారూ తప్పక తెలుసుకోవాలి. యముని భయం తీరాలంటే ఈ ఉపనిషత్తును అధ్యయనం చేయాలి.

కృష్ణ యజుర్వేదంలో యమధర్మరాజు – నచికేతుల సంవాద రూపంగా ఈ ఉపనిషత్తు ప్రఖ్యాతి వహించింది. కృష్ణ యజుర్వేదంలోని కఠశాఖకు

చెందిన బ్రాహ్మణాలలోనిది ఈ ఉపనిషత్తు. కారక ఋషి ఈ బ్రాహ్మణానికి కర్త. దశోపనిషత్తులలో ఎంతో ప్రాచీనమైనదిగా భావించబడేది ఈ ఉపనిషత్తు. చెప్పేదేదో గట్టిగా – సూటిగా – సందేహాలకు తావు లేకుండా చెప్పేశారు యమధర్మరాజు. **ఆత్మ తత్వబోధను** సమగ్రంగా అందిస్తున్నదీ ఉపనిషత్తు. అందుకొని, ఆచరించి, ఆనందించి, తరించటం – ఇక మన చేతుల్లో – చేతల్లో ఉన్నది.

శ్రేష్ఠమైన దశోపనిషత్తులలో 3వదైన ఈ కఠోపనిషత్తు చాలా సుబోధమైనది. ఉపనిషత్తు అంటే బ్రహ్మ విద్యయే. బ్రహ్మ జ్ఞానమే. ఐతే చాలా ఇతర ఉపనిషత్తులలాగా ఉపాసనలను, కర్మలను కలగలిపి; అసలు విషయాన్ని క్లిష్టం చెయ్యకుండా; అన్ని ముఖ్య విషయాలను వదలి పెట్టకుండా వెల్లడిస్తూ ఈ కఠోపనిషత్తు బ్రహ్మ విద్యను, సుస్పష్టంగా, సువ్యక్తంగా బోధించి వివరిస్తున్నది. జగదేక సత్యమైన పరబ్రహ్మను – పరమాత్మను సుస్పష్టంగా మన హృదయంలో సాక్షాత్కరింపజేస్తున్నది.

**ఈ ప్రపంచంలోని సమస్త దుఃఖాలకు ఆపదలకు మూల కారణం అవిద్యయే.** అజ్ఞానమే. తానెవరో తనకు తెలియకపోవటమే. మానవుడు ఈ దేహమే తాను అని భ్రమపడుతున్నాడు. ఇదే అజ్ఞానం. దేహం ఎన్నటికీ 'నేను' కావటానికి వీలు లేదు. జనన మరణాలు లేకుండా శాశ్వతంగా ఎల్లప్పుడూ అంతటా ఉండే చైతన్యమైన ఆత్మయేనేను. ఏ మార్పులు లేని, ఏ ఆకారమూ లేని, ఏ పరిమితులు లేని, ఏ కల్మషాలు లేని ఆనంద స్వరూపమైన ఆత్మయే నేను. అట్టి ఆత్మను శాస్త్రాలద్వారా, గురువుల ద్వారా తెలుసుకొని, విచారణచేసి, బాగుగా ధ్యానించి, సుస్పష్టముగా గ్రహించి, అనుభవించుటయే జ్ఞానం. అట్టి ఆత్మగా సర్వకాల సర్వావస్థలయందు ఎరుక కలిగి ఉండి పోవటమే మోక్షం.

ఇట్టి ఆత్మ జ్ఞానమును నచికేతుడు కోరగా, యమధర్మరాజు అనేక ఉదాహరణలతో – అనేక రీతులలో వివరించి, బోధించటమే ఈ ఉపనిషత్తు సారాంశము.

ఆత్మను క్రొత్తగా ఎవరూ ఎక్కడనుంచీ పొందనక్కరలేదు. అది బయట వస్తువు కాదు – ప్రతీ వ్యక్తీ నిజంగా ఆత్మ అయ్యే ఉన్నాడు. అంటే ప్రతివాడూ ఆత్మను పొందియే ఉన్నాడు. కనుక పొందట మంటే లేని వస్తువును తెచ్చుకోవటం లాంటిది కాదు. **'అది నేనే'** నని తెలుసుకొనుటయే. ప్రతి వడ్లగింజ – బియ్యపు గింజయే – ప్రతి ప్రాణి ఆత్మయే. ప్రతి జీవుడిలోను ఆత్మ శుద్ధచైతన్య రూపమై, స్వయం ప్రకాశమై ఉండనే ఉన్నది. ఆ చైతన్యము వల్లనే సర్వకార్యములు జరిగిపోతున్నప్పటికీ అజ్ఞాని మానవుడు ఆత్మను తెలుసుకొనలేక పోతున్నాడు. అందుకే శ్రుతి మాత ఇలా అంటున్నది.

**"ఉత్తిష్టత – జాగృత – ప్రాప్యవరాన్ని బోధత"**

లెండు, మేలుకొనుడు, ఆత్మజ్ఞానులగు మహాత్ములను శరణువేడి ఆత్మను తెలుసుకొనుడు. ఇది స్వామి వివేకానందుల గుండెలోతుల్లో నుండి పెల్లుబికి వచ్చే వాక్యం.

ఈ ఆత్మజ్ఞానమునే ఈ కఠోపనిషత్తు మరల మరల విసుగు లేకుండా బోధిస్తున్నది. ఆసక్తిగలిగినవాడు, బుద్ధి మంతుడైనవాడు, విచారణాశీలుడైనవాడు దీనిని ప్రశాంతమైన మనస్సుతో – సూక్ష్మమైన బుద్ధితో చదివినా, విన్నా ఈ విషయాన్ని పూర్తిగా, స్పష్ఠంగా గ్రహించగలుగుతాడు. ఐతే **నేను** సత్యము, నిత్యము, చైతన్య మాత్రము, ఆనంద స్వరూపము అయిన **బ్రహ్మమును,** నేనీదేహ – ఇంద్రియ – మనోబుద్ధులకు అతీతుడను **అను జ్ఞానము ఈ ఉపనిషత్తును వింటే కలుగవచ్చునుగాక. అంతమాత్రం చేతనే అతడు ఆత్మానందమును పొందలేడు.**

మరి ఎప్పుడు పొందుతాడు? **"నేను పవిత్రమై, జనన మరణ రహితమై, నిత్యమై, ఆనందస్వరూపమై, ఏ మార్పులు లేని, ఏ మలినాలు లేని, శాశ్వత సత్యమైన ఆత్మను" అనే భావాన్ని అదే పనిగా, ఏకధారగా, గంగా ప్రవాహంలాగా, నిత్యము - నిరంతరము మననము చేస్తూ ఉంటే, ఈ సాధన మనలోని అజ్ఞానాన్ని నశింపజేసి పరమశాంతిని, పరమానందమును కలిగిస్తుంది.**

**ఒక విశాలమైన ఆవరణలో,** ప్రశాంత వాతావరణంలో **స్వామీజీ** ఒకరు ఎంతో **గంభీరంగా,** సులువుగా అర్థమయ్యేవిధంగా **వేదాంతోపన్యాసం చేస్తున్నారు.** ఆ ప్రక్కగా దారిన వెళుతున్న ఒక సామాన్యుడు **మైకు ద్వారా ఆ ఉపన్యాసాన్ని వింటూ,** ఒక్కక్షణం నిలచిపోయి తనను తాను ఆత్మగా తెలుసుకున్నాడు; ఆ క్షణంలో తాను ఆత్మను అని అతడు **తెలుసుకున్నప్పటికీ తన మనస్సు దృఢంగా దేహాత్మ భావంలో ఉన్నది గనుక తాను దేహాన్ని అనే భావిస్తాడు,** దేహంగానే వ్యవహరిస్తాడు తప్ప నేను ఆత్మను అని మరల ఎప్పుడూ భావించలేదు, భావించడు. 'ఆత్మ' అనే భావానికి అతడి మనస్సులో చోటు లేదు. అనేక విధాలైన **కోరికలతోను, రాగద్వేషాలతోను, ఆశలు, ఆందోళనలతోను అతడి మనస్సు నిండి ఉండటం వల్ల నేను-నాది అనే అహంకార మమకారాలను విడువలేక, దేహాభిమానాన్ని వదలలేక ఆత్మను కొద్ది క్షణాలు కూడా భావించలేదు. కోరికలు లేని నిర్మల మనస్సుతో - రాగద్వేషాలు లేని నిశ్చలమైన మనస్సుతో శాంతియుతమైన ఏకాగ్ర మనస్సుతోనే ఆత్మను భావించ వీలవుతుంది.** అంతేగాని రాగద్వేషాలతోను, కోరికలతోను, విషయభోగాలపై ఆసక్తితోను పరుగులు పెట్టే చంచలమైన మనస్సుతో ఆత్మను తెలుసుకొనే అవకాశమే లేదు. **అందుకే తాను ఆత్మను అని తెలుసుకున్నప్పటికీ అందరూ ఆత్మగా ఉండి పోవటంలేదు; ఆత్మానుభూతిని చెందటం లేదు. ఆత్మానందాన్ని పొందటం లేదు.**

దీనిని బట్టి మనకొక విషయం రూఢి అవుతున్నది. ఆత్మను బుద్ధి ద్వారా తెలుసుకో గలుగుతున్నాం. మనం ఆత్మయేగాని అన్యంకాదని కూడా బుద్ధి ద్వారా తెలుసుకొని, రూఢి పరచుకోగలుగుతున్నాం. ఐతే ఆత్మానుభూతిని చెందటం లేదు; తద్వారా ఆత్మానందాన్ని అనుభవించటం లేదు. ఎందువల్ల? కేవలం బుద్ధితో గ్రహించటం వల్లనే. నిజంగా దేహంకన్నా, అన్ని ఇంద్రియాలకన్నా – మనస్సు కన్నా బుద్ధి గొప్పది. నిజమే. **కాని ఆత్మ దృష్ట్యా చూస్తే బుద్ధి అల్పమైనదే.** బుద్ధికి ఎంత సమర్థత ఉందో అంతే తెలుసుకోగలుగుతున్నాం. అంటే **బుద్ధి పరిమితమైనదే గనుక మనం తెలుసుకొనేదీ పరిమితంగానే ఉన్నది.** అయితే అపరిమితమైన ఆత్మను తెలుసుకొని ఆత్మ విదుడుగా – ఆత్మజ్ఞానిగా ఉండి పోవాలంటే **బుద్ధి ద్వారా గ్రహించిన జ్ఞానంచాలదు. బుద్ధికి అతీతంగా ఆత్మచేతనే తెలియబడాలి. అదే ఆత్మానుభూతి –** ఇది ఎలా సాధ్యపడుతుంది? **ఎప్పుడైతే మనస్సు పవిత్రమై, ప్రశాంతమై, నిశ్చలమై, ఏకాగ్రత కలిగినదై – నిరంతర ఆత్మధ్యానంలో ఉండిపోతుందో అప్పుడే అన్ని ఆలోచనలు ఆగిపోయి – మనోబుద్ధులు అదృశ్యమై కేవల ఆత్మమాత్రమే మిగిలిపోతుంది. మనస్సు ఆత్మయే అవుతుంది. అప్పుడే ఆత్మానుభూతి.**

అట్టిస్థితిని ప్రతిసాధకుడూ ప్రయత్నపూర్వకంగా కల్పించుకోవాలి. **అది కేవలం వైరాగ్యం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది.** బ్రహ్మజ్ఞానం – లేదా మోక్షం వైరాగ్యం వల్లనే కలుగుతుంది. ప్రాపంచిక విషయాలపై విరక్తి కలగాలంటే అసలు ఈ ప్రపంచము – ఇందలి విషయాలు – భోగాలు – వీటిని అనుభవించాలనుకుంటున్న – అనుభవిస్తున్న జీవుళ్ళు – అంతా **రాత్రి కలలాగా మిథ్య మాత్రమేననే సత్యం బాగా అవగాహన కావాలి.** స్వప్నంలో ఉన్నంత వరకు మాత్రమే సత్యం అనిపించే స్వప్న దృశ్యం యావత్తు మేలుకోగానే అసత్యం అని ఎలా తెలుస్తున్నదో అలాగే

ఈ జాగ్రత్‌లో ఉన్నంతకాలమే – ఈ మనస్సుతో భావించినంత కాలమే ఈ జాగ్రత్ దృశ్యం సత్యం అని, జాగ్రత్‌లో నుండి మేలుకోగానే – అంటే జీవభావాన్ని వదులు కోవటంతోనే ఇది యావత్తూ అసత్యమేనని రూఢి పరచుకోవాలి.

అప్పుడే ఈ ప్రపంచంపట్ల – ఇందులోని వస్తువులు, విషయాలు, భోగాలపట్ల వైముఖ్యం కలుగుతుంది; **వైరాగ్యం కలుగుతుంది.** అలాంటి వైరాగ్యం కలిగినప్పుడు మనస్సులోని రాగద్వేషాలు అంతమైపోయి **మనస్సు పవిత్రం అవుతుంది;** ప్రశాంత మవుతుంది; నిశ్చలమవుతుంది; ఏకాగ్రమవుతుంది. **అట్టి మనస్సుతో ఆత్మధ్యానం సాగించినప్పుడు ఆత్మానుభూతి కలుగుతుంది.**

అందుకే ఈ కఠోపనిషత్తులో మరి ఏ ఇతర ఉపనిషత్తులలోను అంతగా ప్రస్తావించని **వైరాగ్యమును** గూర్చి విశేషంగా వర్ణించబడియున్నది. అంతేకాదు ఈ ఉపనిషత్తులోని శిష్యుడు **నచికేతుడు మూర్తీభవించిన వైరాగ్యమే.** ఏ ఉపనిషత్తులోను ఇటువంటి మహానుభావుడైన, బ్రహ్మ విద్యకు అధికారి ఐన, **పరమ వైరాగ్యమూర్తి ఐన శిష్యుడు కనిపించడు.** యమ ధర్మరాజు రథములు, గుర్రములు, నృత్యగానములు చేసే అప్సరస స్త్రీలను ఇస్తాను అని ఆశ చూపితే **'వాటిని నీవే ఉంచుకో' అని గురువగు యమునితో పలికిన వైరాగ్యమూర్తి నచికేతుడు.** దీనిని బట్టి **మోక్షప్రాప్తికి వైరాగ్యము, చిత్త ఏకాగ్రతకావాలి. ఆ రెండూ ఎలా సాధించాలో ఎంతో వివరంగా ఈ కఠోపనిషత్ వివరిస్తున్నది.** కనుక ఉపనిషత్తును శ్రద్ధగా వినటం – ప్రతిరోజూ మననం చేయటం – బుద్ధితో గ్రహించటం మాత్రమే కాక – బుద్ధితో గ్రహించిన దానిని అనుభవానికి తెచ్చుకొనుటకు ఎక్కవలసిన మెట్లను ఎక్కి; ప్రయత్నపూర్వకంగా ముందుకు వెళ్ళి ఆచరణచేసి

ఆత్మానుభూతిని పొందాలి. శాంతి మంత్రంతో ఉపనిషత్తులో ప్రవేశిద్దాం.

**ఓం సహనావ వతు । సహనౌ భునక్తు । సహవీర్యం కరవావహై।**

**తేజస్వినావధీతమస్తు । మా విద్విషావహై ॥**

**ఓం శాంతిః శాంతిః శాంతిః ॥**

**ప్రతి పదార్థం :** ఓం = పరమాత్మ; నౌ = మా ఇరువురినీ; సహ = కూడ; అవతు = రక్షించుగాక; నౌ = ఇరువురము; సహ = కలిసి; భునక్తు = అనుభవించెదముగాక; సహ = కలిసి; వీర్యం = సామర్థ్యంతో; కరవావహై = ప్రయత్నం చేసెదముగాక; నౌ = మా ఇరువురి ప్రయత్నము; తేజస్వి = తేజోవంతముగా; అధీతం అస్తు = అగుగాక; విద్విషావహై = ద్వేషభావము; మా = కలుగకుండుగాక; ఓంశాంతిః శాంతిః శాంతిః = ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మికతాపాలు లేకుండు గాక;

**భావం :** పరమాత్మ గురు శిష్యులైన మా ఇరువురినీ **రక్షించుగాక.** ఈ ఉపనిషత్తు బోధించే జ్ఞానాన్ని మేం ఇరువురము **అనుభవించెదముగాక.** మా ప్రయత్నం ద్వారా ఉపనిషత్తులోని జ్ఞానాన్ని గ్రహించి ఆచరించే శక్తిని **సామర్థ్యాన్ని పొందెదముగాక.** మా ఇరువురి ప్రయత్నము **తేజో వంతమగుగాక.** మా ఇద్దరి మధ్య ద్వేషభావము కలుగకుండుగాక!.

ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక తాపములు శాంతించు గాక!

**వ్యాఖ్య :** వేదాంత విద్య గురు శిష్యపరంపరగా నేర్చుకోవలసినదే. అలా నేర్చు కోవాలంటే సాధకుడు **ఉత్తమ శిష్యుడుగా** ఒక సద్గురువును వెతుక్కోవాలి. ఆ గురువును వినయంతో సమీపించాలి; ఆశ్రయించాలి; సేవించాలి; శ్రవణం చేయాలి. అప్పుడే **శ్రవణఫలం** లభించేది. అయితే సద్గురువును **ఆశ్రయించటంలో, సేవ చేయటంలో,** వారి వద్ద **శ్రవణం చేయటంలో** మానవుడికి ఉన్న **రజస్తమోగుణాలు అడ్డునిలుస్తాయి.** అందుకే

కృష్ణ యజుర్వేదంలోని ఈ ఉపనిషత్తు యొక్క శాంతి మంత్రం ఆధ్యాత్మిక రంగంలో గురుశిష్య సంబంధం ఎలా ఉండాలో తెలియజెబుతున్నది. చెప్పినది విని ఆచరిస్తే శాంతి తథ్యం.

**1. సహనౌ అవతు :** పరమాత్మ మా ఇరువురినీ రక్షించుగాక! అని గురుశిష్యులిద్దరూ వేడుకుంటున్నారు. గురుశిష్యులిద్దరూ ఒకే స్థాయిలోని వారుకాదు. అయినా వారి వారి స్థాయిలలో భగవంతుని రక్షణకావాలి. **ఉపనిషత్తులో నిక్షిప్తం చేయబడిన జ్ఞానం తమ స్వంతమై పోవాలి. నాలుగు సమయాలలో ఈ విద్య వారి వారి స్వంతమౌతుంది.**

**శ్లో॥ చతుర్భిశ్చ ప్రకారైః విద్యా ఉపయుక్తాభవతి ।**

**ఆగమకాలేన, స్వాధ్యాయకాలేన, ప్రవచనకాలేన; వ్యవహారకాలేనేతి॥**

– నేర్చుకొనే సమయంలో; మననం చేసేటప్పుడు; ప్రవచనం చేసేటప్పుడు; ఆచరణ చేసేటప్పుడు – **ఈ నాలుగు సమయాలలో విద్య తనదవుతుంది.** ఇక్కడ శిష్యుడు నేర్చుకొనేస్థాయిలో (శ్రవణం చేసే స్థాయిలో) ఉంటాడు. గురువు ప్రవచనం చేసే స్థాయిలో ఉంటాడు. **ఇద్దరూ వేరువేరు స్థాయిలలో ఉంటారు.** అయినా ఇద్దరికీ పరమాత్మ రక్షణకావాలి. **అనుగ్రహం కావాలి.** శిష్యుడు శాస్త్రాన్ని శ్రవణం చేయాలంటే గురువుపై అచంచలమైన శ్రద్ధ ఉండాలి. శాస్త్రాన్ని బాగా గ్రహించాలంటే **అహంకారం అంతరించి గురువును సేవించాలి. ఆశ్రయించాలి.** దీనికై పరమాత్మ యొక్క రక్షణ కావాలనిప్రార్థన. గురువు శిష్యుని స్థాయిలోనికి వచ్చి బోధించాలంటే శిష్యునిపై వాత్సల్యం ఉండాలి. మంచి సమయస్ఫూర్తి ఉండాలి. సహనం ఉండాలి. దీనికై రక్షణ కావాలి.

**2. సహనౌభువక్తు :** ఈ జ్ఞానాన్ని ఇరువురము అనుభవించెదము గాక! ఈ ఉపనిషత్ జ్ఞానాన్ని గురువు **ఉత్సాహంతో బోధిస్తుంటే** శిష్యుడు కూడా

ఉత్సాహంగా వినగలుగుతాడు. అలాగే శిష్యుడు ఎంతో **ఆసక్తితో - తన్మయత్వంలో** లీనమైపోయి వింటుంటే గురువు ఎంతో ఉత్సాహంగా తన సర్వశక్తులను ధారపోస్తాడు. శిష్యుడు నిద్రపోతున్నా, పరధ్యానంలో ఉన్నా, వినయంగా లేకున్నా **గురువు సరిగ్గా బోధించలేడు.** ఇలా ఇద్దరిలో ఏ ఒక్కరిలో లోపం ఉన్నా జ్ఞానార్జన సరిగ్గా చేయనట్లే. **మననానికి ఇబ్బందే. ఉపనిషత్తును శ్రవణం చేస్తూ శిష్యుడు ఆనందించాలి. బోధిస్తూ గురువు ఆనందించాలి.** లోతుగ అర్థం చేసుకున్నప్పుడే ఈ ఆనందం కలిగేది - ఇట్టి ఆనందం కలగాలనే **భగవంతునికి ప్రార్థన.**

**3. సహవీర్యం కరవావహై :** ఉపనిషత్ బోధను **లోతుగ అర్థం చేసుకొని, గ్రహించి దానిని జీవితంలో ఆచరణలో పెట్టు కొనేందుకు తగిన సమర్థతను పొందెదముగాక.** ఉపనిషత్తులలో నిగూఢంగా దాగి ఉన్న తత్త్వరహస్యాలను చెప్పటమూ కష్టమే. వినటమూ కష్టమే. **జ్ఞానార్జనకై తపించే తపస్సంపన్నులైన సద్గురువులే** అలా చెప్పగలరు; అనేక జన్మలలో సుకృతాలు చేసుకొని మంచి సంస్కారాలు గల శిష్యులే వినగలరు. ఎంత చెప్పినా - ఎంతవిన్నా అందరూ వారి వారి ప్రకృతికి తగినట్లే ప్రవర్తిస్తుంటారు. గురువు మరీ మృదు స్వభావం కలవాడైతే శిష్యుని ప్రకృతికి తగ్గట్టుగా కరకుదనంతో సాధనలు చెప్పలేడు. శిష్యుడు దంభాభిమానాలు గలవాడైతే గురు బోధ చక్కగా ఉన్నా సాధనలో ముందంజవేయలేడు. సద్గురు కృపను పొందలేడు.

లౌకిక దృష్టితో చెప్పే బాధ గురువులు ఎందరో ఉంటారు. తత్త్వ దృష్టితో చెప్పే బోధ గురువులు అరుదుగా ఉంటారు. ఈ జన్మలో సుఖంగా - ఆరోగ్యంగా - ఆనందంగా ఉండాలంటే ఇలా చేయండి, సంపదలు కావాలంటే అలా చేయండి, అనే ఉపదేశాలు చేసే గురువులే బాధ

గురువులు. **అసలు ఈ ప్రపంచమే మిధ్య. పరమాత్మతో ఏకత్వానుభూతిని – ఐక్యతను పొంది మోక్షం పొందుటే సర్వ దుఃఖాలకు చరమగీతం పాడటం, శాశ్వతానందాన్ని పొందటం అని చెప్పే వారే బోధగురువులు. నిజమైన సద్గురువులు. అట్టి సద్గురువులను ఆశ్రయించి – అనుసరించాలని చెబుతున్నదీ మంత్రం.**

**4. తేజస్వినావధీత మస్తు :** మా ఇరువురి ప్రయత్నము తేజోవంతమగుగాక. గురుశిష్యుల మధ్య ఏ విషయంలో గట్టి సంబంధం ఉండాలో చెబుతున్నారు. ముక్తి సాధన – తత్త్వదృష్టి. ఈ రెండూ నావల వంటివి. దాటటానికి, దాటించటానికి. గురు శిష్యులిరువురూ ముక్తి సాధన – తత్త్వదృష్టిగల వారైతే ఆయన బోధ గురుశిష్యులిద్దరినీ తేజోవంతం చేస్తుంది. బాధ గురువైతే ఇద్దరూ తేజస్సును కోల్పోతారు. ఇక శిష్యుడు ముక్తిసాధన – తత్త్వదృష్టి లేనివాడైతే శిష్యుడు తేజస్సును కోల్పోతాడు. కనుక ముక్తిసాధనే ధ్యేయంగా గురువుబోధ – శిష్యుని శ్రవణం ఉండాలి. అప్పుడే తేజస్వంతులయ్యేది.

**5. మావిద్విషావహై :** మా ఇరువురి మధ్య ద్వేషం కలుగకుండుగాక ! అసలు ద్వేషం ఎందుకొస్తుంది? లౌకిక దృష్టి ఉంటేనే ద్వేషం కలిగేది. శిష్యులకు లౌకిక దృష్టి ఉంటే పెద్ద అవాంతరం జరుగుతుంది. వారికై వారికి తెలియదు. సవరించకూడదు. దండిస్తే కోపం వస్తుంది. అందువల్ల గురువు దండించ లేకపోవచ్చు. అదీ శిష్యునికే నష్టం. శిష్యుడు అంటే అనుయాయుడు. అనుసరించేవాడు అని అర్థం. తన స్వంత ఆలోచనల ప్రకారం కాకుండా గురువు ఆదేశించిన ప్రకారం తూ.చ తప్పకుండా అనుసరించేవాడే ఉత్తమ శిష్యుడు. అయితే లౌకిక దృష్టి ఉన్న శిష్యుడు గురువును అనుసరించలేడు. అందువల్ల సాధన సాగదు. గురువు చెప్పలేక – చెప్పకుండా ఉండలేక సతమతమౌతాడు. **సద్గురువులకు బాధకలిగితే**

**శిష్యుణ్ణి అమంగళం ఆవరించినట్లే.** కనుక శిష్యుడు ముక్తి సాధనయే ధ్యేయంగా పెట్టుకున్న సద్గురువునే ఆశ్రయించాలి. ఆతర్వాత తాను 'మురళి' ఐ పోవాలి. అంటే తన స్వంత ఆలోచనలను ప్రక్కన బెట్టి గురువు చూపిన మార్గంలోనే నడవాలి. ఇప్పుడిక ద్వేషభావానికి చోటుండదు. ఆధ్యాత్మిక ప్రగతికి ఆటంకముండదు.

**6. ఓంశాంతిః శాంతిః శాంతిః :** దైవంచేత కల్పించబడే ఆధి దైవిక తాపాలు, చుట్టూ ఉన్న భూతములచేత కల్పించబడే ఆధి భౌతికతాపాలు; అంతరంగంలోని మనోబుద్ధులచేత కల్పించబడే ఆధ్యాత్మిక తాపాలు శాంతించి ఉపనిషత్ శ్రవణం నిరాటంకంగా, నిర్విఘ్నంగా నిరంతరంగా సాగిపోవాలని పరమాత్మకు ప్రార్థన. కృష్ణయజుర్వేదంలోని కఠశాఖకు చెందిన బ్రాహ్మణాలలోనిదీ ఉపనిషత్తు. కఠమహర్షి అందించినది గనుక కఠోపనిషత్తు అయినది.

# ప్రథమాధ్యాయం

## ప్రథమ వల్లి

(వచనం)

**మం॥ ఓంఉశన్ హవై వాజశ్రవసః సర్వవేదసం దదౌ ।**
**తస్య హ నచికేతా నామ పుత్ర ఆస. ॥ (1)**

**ప్రతి॥** ఉశన్‌హవై = స్వర్గ ఫలమును కోరినవాడై ; వాజశ్రవసః = వాజ శ్రవసుడు; సర్వవేదసం = తన సర్వస్వమును; దదౌ = దానం చేస్తున్నాడు; తస్య = అతడికి; నచికేతా నామ = నచికేతుడనేపేరుగల ; పుత్ర ఆస = కుమారుడుగలడు.

**భావం :** స్వర్గ ఫలాలను కోరిన వాజశ్రవసుడు, తన సర్వస్వాన్నీ దానం చేయ ప్రారంభించాడు. అతడికి నచికేతుడనే పుత్రుడు గలడు.

**వ్యాఖ్య :** వాజశ్రవసుడు తన సర్వస్వాన్నీ దానంచేయ సంకల్పించాడు. ఎందుకంటే స్వర్గ ఫలాలను కోరి. (ఇక్కడే కొంత కథను మనం గుర్తుచేసుకోవాలి) పూర్వకాలంలో రాజులు దిగ్విజయయాత్రను పూర్తిచేసి, అనేక మంది రాజులను జయించి, వారి వద్ద కప్పంగా ధనాన్ని, అనేక సంపదలను, బహుమతులను స్వీకరించి రాజధానికి తిరిగి వచ్చిన తర్వాత ఒక యాగం చేస్తారు. **అదే 'విశ్వజిత్ యాగం'.** ఆ యాగంలో తాను సంపాదించిన సంపదలను, ధనాన్ని, గోవులను, సువర్ణాన్ని బ్రాహ్మణులకు దక్షిణగా సమర్పిస్తారు. దీని వల్ల స్వర్గలోక సుఖాలు, భోగాలు కలుగుతాయని శాస్త్ర వాక్యం.

రాజులేగాక గృహస్తులుగా ఉన్న వారు కూడా, తమ భాద్యతలను సక్రమంగా, పూర్తిగా నిర్వర్తించుకొని, తన శేష జీవితాన్ని భగవత్ సేవలో పూర్తిగా వినియోగించు కోవాలని – అంటే సన్యాసం స్వీకరించాలని

నిశ్చయించుకొని, సర్వ సంగపరిత్యాగం చెయ్యటానికి సిద్ధపడి **ఈ 'విశ్వజిత్ యాగం'** చేస్తారు. ఈ యాగసమయంలో తనకున్న ఆస్తి నంతటినీ బ్రాహ్మణులకు దానమిచ్చి అన్ని లౌకిక బంధాలను వదిలించుకుంటారు.

ఆ సాంప్రదాయాన్ని అనుసరించే **వాజశ్రవసుడు** ఉత్తమ గృహస్థుడుగా తన బాధ్యతలు పూర్తిగావించుకొని లౌకిక బంధాలను వదలి స్వర్గ సుఖాలను కోరినవాడై ఈ విశ్వజిత్‌యాగాన్ని చేయసంకల్పించి, బ్రాహ్మణులకు తన సర్వస్వాన్నీ దానం చేస్తున్నాడు. అతడికి నచికేతుడనే కుమారుడున్నాడు.

దీనిని బట్టి వాజశ్రవసుడు ఉత్తమ వంశ సంజాతుడని తెలుస్తున్నది. అసలు 'వాజశ్రవసుడు' అనే పేరులోనే అతడి ఆధిక్యత తెలుస్తుంది. వాజ అంటే దానం చేయటం ద్వారా; శ్రవస్ అంటే కీర్తిని పొందినవాడు అని అర్థం. వాజశ్రవసుని తండ్రి గొప్ప అన్నదాత. బహుశా అందుకే అతడు తన కుమారునికి ఇలాంటి పేరుపెట్టి ఉండాలి. వాజశ్రవసుని తండ్రి పేరు కూడా వాజశ్రవస్సు అని గ్రంథాలు చెబుతున్నాయి. ఆయన అన్నదానం చేసి గొప్ప కీర్తిని పొందినవాడు. అట్టి వంశంలో జనించినవాడే మన నచికేతుడు.

విశ్వజిత్‌యాగం అంటే ఒక్కరోజులో పూర్తి కావలసిన యాగం. యజమాని తన ఆస్తినంతటిని ఒక్క రోజులో దానంచేసేయాలి. **విశ్వజిత్ అంటే విశ్వాన్ని జయించటం అని అర్థం.** అంటే – యుద్ధం చేసి రాజులందరిని జయించి విశ్వ విజేత కావటంకాదు దీని అర్థం. **విశ్వ బంధనాల నుండి విడుదల పొందటమే. అంటే అన్ని ప్రాపంచిక విషయాలనుండి, భోగాల నుండి విడుదల పొంది పరమాత్మతో అనుసంధానం కావటమే నిజమైన అర్థం.**

కర్మకాండ – (యజ్ఞ యాగాదులు) మానవుని యొక్క ఆశలు, కోరికలు తీర్చుకొనుటకు వేదాలలో చెప్పబడినది. అయితే ఇది తాత్కాలిక ఫలమే. అందుకే ఉపనిషత్తులు "ఆశలన్నింటిని విడిచిపెట్టండి. శాశ్వతానందాన్ని

పొందండి” అని మానవులను ఉద్బోధిస్తున్నవి. ఈ ఉపనిషత్తు కూడా ఈ విషయాన్నే దృఢపరుస్తుంది. “మనిషి తన సమస్త ఆశలను త్యజిస్తే ఈ జన్మలోనే అమరత్వాన్ని చెంది, బ్రహ్మజ్ఞానంతో జీవన్ముక్తుడవుతాడు” అని. (వచనం)

**మం॥ తం హ కుమారం సంతం దక్షిణాసు ।**
**నీయమానాసు శ్రద్ధాఽఽవివేశ సోఽమన్యత ॥(2)**

**ప్రతి॥** కుమారం సంతం = బాలుడే ఐనప్పటికీ; తం = అతనిలో (ఆ నచికేతునిలో); దక్షిణాసు = దక్షిణలుగా కానుకలు; నీయమానాసు = తీసుకొని రాబడుతుండగా; శ్రద్ధా = శ్రద్ధ; ఆవివేశ = ఆవేశించింది; సః అమన్యత = అతడిలా అనుకొన్నాడు.

**భావం :** నచికేతుడు బాలుడే అయినప్పటికీ; ఋత్విజులకు దక్షిణలుగా ఇవ్వటానికి కానుకలు తేబడుతూ ఉంటే చూచిన అతనిలో ‘శ్రద్ధ’ ఆవేశించింది. అతడు తనలో ఇలా అనుకొంటున్నాడు.

**వ్యాఖ్య :** మానవుడు ఎలా ప్రవర్తించాలో, అంతిమంగా ఏ లక్ష్యాన్ని సాధించాలో; అందుకై అతడు ఎలాంటి కర్మలను చేయాలో శాస్త్రం చక్కగా నిర్దేశించి చెబుతుంది. అయితే అల్ప మానవుడు **అతి తెలివితో తన స్వార్థబుద్ధిని** సమర్థించుకోవటానికి శాస్త్రానికి తప్పుడర్థాలు చెప్పి తన పబ్బం గడుపుకుంటూ ఉంటాడు. తన తప్పులను సమర్థించు కోవటానికే ఆ శాస్త్రాలలోనే ఉన్న వేరొక భావంతో, వేరొక సందర్భంలో చెప్పిన విషయాలను దీనికి ముడి పెడతాడు. ఇది మనష్యులందరికీ ఉగ్గుబాలతో వచ్చిన విద్యయే. ఒక్కొక్కప్పుడు ఎంత గొప్ప వారైనా ఈ రకమైన ఆలోచనలు చేసి అలాగే ప్రవర్తిస్తూ ఉంటారు. ఇప్పుడు వాజశ్రవసుడు కూడా ఎంత గొప్ప వంశంలో జన్మించినా తనకున్నదంతా ఇచ్చివేయాల్సి వచ్చేటప్పటికి తన అల్పత్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఆయన బ్రాహ్మణులకు

ఇవ్వటానికి తెచ్చే దక్షిణలను అంటే గోవులను మొదలైన వాటిని చూస్తున్న అతని కుమారుడు నచికేతునిలో శ్రద్ధ ఆవేశించింది.

నచికేతుడు చిన్నవాడు, బాలుడు, అతడికి ఈ లోకపు మాయా మర్మాలతో పెద్దగా పరిచయంలేదు. ఉత్తమ వంశ సంజాతుడు. సక్రమంగా తల్లిదండ్రుల చేత పెంచబడిన వాడు. అందుకే అతడు జరుగుతున్న తతంగాన్ని చూచి సహించలేక పోతున్నాడు. యాగం అనేది ఎందుకుచేయాలో, ఎలా చేయాలో శాస్త్రాలలో చెప్పబడ్డది. విశ్వజిత్ యాగం యొక్క అంతరార్థాన్ని గ్రహించకుండా తండ్రి ఏదో విధంగా యాగం పూర్తయిందనిపించాలని పడుతున్న ఆరాటాన్ని గ్రహించాడు. తండ్రి చేస్తున్న తప్పిదం వల్ల తండ్రికీ, వంశానికి చెడ్డపేరు వస్తుందని, తండ్రి ఏ ఫలాన్ని కోరి యాగం చేస్తున్నాడో ఆ ఫలం సిద్ధించక పోగా వ్యతిరేకఫలం కూడా కలగ వచ్చునీ భావించాడు. అందుకే అతడిలో శ్రద్ధ ఆవేశించింది.

శ్రద్ధ అంటే ఆస్తిక్య బుద్ధి. శాస్త్రాలు చెప్పే విషయాలు మానవ జన్మను తరింప జేయటానికేననే విశ్వాసం. ఆధ్యాత్మిక జీవనం సాగించటానికి శ్రద్ధ అనేది అత్యంత అవసరం. శంకరుల వారు శ్రద్ధకు విపులమైన నిర్వచనం ఇచ్చారు. గురు వాక్యముల యందు, వేదాంత వాక్యములయందు చలించని విశ్వాసాన్ని (నమ్మకాన్ని) కలిగి ఉండటమే శ్రద్ధ అని. వేదాంత వాక్యముల యందు - గురుబోధయందు విశ్వాసం లేకపోతే ఎవరు ఆచరణచేస్తారు? నిజంగా వేదాంత వాక్యాలను అర్థం చేసుకోవటానికి కూడా శ్రద్ధ అనేది ఒక అర్హతగా ఉండాలని సాధన చతుష్టయంలో దాన్ని కూడా చేర్చారు. ఆధ్యాత్మిక రంగంలోనే కాదు లౌకిక వ్యవహారములలో కూడా శ్రద్ధ అనేది అవసరమే. నేనిది చేయగలను అనే విశ్వాసం లేకపోతే ఏ పనినీ ప్రారంభించనూలేవు, ప్రారంభించినా పూర్తి చేయనూలేవు. చివరకు అదికొంతచేసి, ఆపి, మరల మరొకటి ప్రారంభించి, ఏ పనీ పూర్తిచేయక ఏ ఫలితాన్ని పొందలేక అస్తవ్యస్తమై పోతాం. లౌకిక విషయాలలోనే ఇలాగైతే

వేదాంత జగత్తులో ఇది మరీ తప్పనిసరి. కనుకనే ఎవరైతే తనకు నిజమైన శ్రేయస్సు కలగాలని దృఢంగా కాంక్షిస్తాడో అటువంటివాడు ఈ ఆధ్యాత్మిక రంగంలో ప్రధానంగా ఆచార్యుని యందు విశ్వాసం; తరువాత శాస్త్రములయందు విశ్వాసం; అన్నింటిని మించి ఆత్మ విశ్వాసం దృఢంగా కలిగి ఉండాల్సిందే. అప్పుడే వేదాంత విషయాలను సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాడు. అర్థం చేసుకున్న విషయాలను ఆచరణలో పెట్టగలుగుతాడు.

నచికేతుడు తండ్రి ద్వారా, గురువుల ద్వారా శాస్త్రాలను తెలుసుకున్నవాడే. వంశ చరిత్రను బట్టి అతడు శ్రద్ధగలవాడే. కేవలం వినేటప్పుడు మాత్రమే శాస్త్రాలపై విశ్వాసం ఉండటంగాక విన్నవిషయాలను ఆచరణలో పెట్టేటప్పుడు కూడా అతడు శ్రద్ధతో ఉన్నాడని ఈ మంత్రం నిర్దేశిస్తున్నది. శ్రద్ధావిష్టుడైన నచికేతుడు తండ్రి నిర్వహిస్తున్నయాగాన్ని, ఆయన ఇచ్చేదక్షిణలను చూస్తున్నాడు. ఈ విషయంలో శాస్త్రం ఏమని నిర్దేశిస్తున్నదో, ఎలా యాగ నిర్వహణ చేయాలో శాస్త్ర విషయాలను జ్ఞాపకం చేసుకుంటున్నాడు. శాస్త్రం యొక్క ఆంతర్యాన్ని తండ్రి ఎలా తనకు అనుకూలంగా మలుచుకుంటున్నాడో అర్థంచేసుకున్నాడు. ఈ విషయంలో తండ్రి పొరపాటు అభిప్రాయాన్ని అవగతం చేసుకున్నాడు. అందుకే అతడు మధనపడుతున్నాడు. తండ్రిని అగౌరవపరచకూడదు. ఎదిరించకూడదు. అలాగని తండ్రి చేసే శాస్త్ర విరుద్ధ కార్యాలను సమర్థించకూడదు. తండ్రికి అధోగతి కలుగకూడదు. మరేం చేయాలి? అందుకే ఆలోచనలో పడ్డాడు. ఏమని ఆలోచిస్తున్నాడు?

**మం॥ పీతోదకా జగ్ధతృణాః దుగ్ధ దోహా నిరింద్రియాః ।**
**అనందానామతే లోకాః తాన్ సగచ్ఛతి తా దదత్ ॥(3)**

మావద్ద లభించే అన్ని పుస్తకముల వివరముల కొరకు ఈ క్రింది లింక్(URL) పై క్లిక్ చేయండి :

http://www.srichalapathirao.com/catalog

"కఠ ఉపనిషత్తు (కఠోపనిషత్తు)"" గ్రంధంపై పూజ్య గురుదేవులు "శ్రీ దేవిశెట్టి చలపతిరావుగారు" చేసిన వ్యాఖ్య 350 పేజీలకు పైగా ఉన్న పుస్తకములు మా వద్ద లభించును

Ebooks మీరు DOWNLOAD చేసుకొనుటకు రూ.300/- లేదా పుస్తకమును మేము మీ ఇంటికి పంపాలంటే (courier ఖర్చులు అదనం కలిపి) ONLINE లో చెల్లించుటకు -

Click & Pay us through Paytm :

http://srichalapathirao.com/images/paytm_QR_WWWSRICHALAPATHIRAOCOM.png

లేదా

Pay us through Net Banking :

http://srichalapathirao.com/PDFs/Bank.pdf

మీకు మరేదైనా సందేహం ఉంటే care@srichalapathirao.com కు ఈమెయిల్ పంపగలరు లేదా +91 80085 39770 OR +91 95388 58115 నంబర్లకు ఫోన్ చేయగలరు

అన్ని పుస్తకములను లేదా కొన్ని పుస్తకములను లేదా గురుముఖతా ప్రవచనములను (వీడియో ప్రవచనముల కొరకు) శ్రవణం చేయుటకు DVD, External Hard Disk లేదా Audio CD, Pen Drive కొరకు ఈ క్రింది లింక్(URL) పై క్లిక్ చేయండి :

http://www.srichalapathirao.com/catalog

WWW.SRICHALAPATHIRAO.COM